# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అమరావతిలో జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు.**

2. **ప్రభుత్వాసుపత్రుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంతో ఆధునిక వైద్య సేవలను ప్రారంభిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

3. **వ్యర్థ పదార్థాల నుండి ఇంధనాన్ని తయారు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేసి డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**

4. **రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలతో పాటు వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

5. **ఐసిసి పురుషుల టి 20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్-న్యూజిలాండ్ జట్లు ఈరోజు తలపడనున్నాయి.**

==========================

రాజధాని అమరావతిలోని పరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన, మా తెలుగు తల్లి గీతాలాపనతో ఈ కార్యక్రమం ప్రారంభం అయింది. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలపై రూపొందించిన ప్రజెంటేషన్లను ముఖ్యమంత్రి వీక్షిస్తున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో 36 ఒప్పందాలపై ఉన్నతాధికారులు సంతకాలు చేస్తారు. మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

---------------------------

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భవిష్యత్ తరాలకు గుర్తుచేసే లక్ష్యంతో అమరావతిలోని స్మృతివనంలో నిర్మాణం జరుగుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. అమరావతిలోని తుళ్లూరు సమీపంలో నిర్మిస్తున్న పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణ పనులను ఆమె నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన అమరజీవి జయంతి వేడుకల సందర్భంగా 6.8 ఎకరాల విస్తీర్ణంలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో ఏర్పాటు చేస్తున్న 58 అడుగుల శ్రీ పొట్టి

శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం స్మృతివనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారు.

---------------------------

ప్రభుత్వాసుపత్రుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంతో ఆధునిక వైద్య సేవలను ప్రారంభిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టార్టప్ సంస్థల సహకారంతో ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 18 ప్రభుత్వాసుపత్రుల్లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించినట్లు వెల్లడించారు. సుమారు 40 పరికరాల ద్వారా 15 రకాల వ్యాధులకు స్క్రీనింగ్, నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. సర్వైకల్ క్యాన్సర్, గుండె జబ్బులు, టీబీ తదితర అనారోగ్యాలను తక్కువ సమయంలో గుర్తించే అవకాశం కలుగుతుందని తెలిపారు. అత్యాధునిక సాఫ్ట్ వేర్ ఆధారంగా వైద్య సేవలు అందించడంతో చికిత్స నాణ్యత మరింత మెరుగవుతుందని చెప్పారు. విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు, కాకినాడ జీజీహెచ్‌లు, విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాల, పార్వతీపురం, తెనాలి జిల్లా ఆసుపత్రుల్లో ఈ ప్రాజెక్ట్ అమలవుతోందని వివరించారు.

---------------------------

వ్యర్థ పదార్థాల నుండి ఇంధనాన్ని తయారు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేసి డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం దొంతాలోని డంపింగ్ యార్డ్ ను ఆయన అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నం, గుంటూరులలో ప్లాంట్ నిర్మాణం పూర్తయిందని మంత్రి నారాయణ తెలియజేస్తూ..

....వాయిస్..30..సెకన్లు

---------------------------

విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో 12 ఏళ్లకొకసారి నిర్వహించే కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కుంభాభిషేకానికి వస్తున్న భక్తులకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో రేపటి వరకు అర్జిత సేవలను రద్దు చేసినట్లు దేవస్థానం ప్రకటించింది. మూడు రోజుల పాటు అంతరాలయ దర్శనాలను కూడా నిలిపివేశారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలతో పాటు వివిధ జిల్లాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో అంబేద్కర్ స్మృతి వనం నుంచి ఇందిరా గాంధీ స్టేడియం వరకు మహిళలకు క్రీడాప్రాధికార సంస్థ(శాప్) వీసీ ఎస్.భరణి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు.

అనంతపురం జేఎన్టీయూ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్, స్థానిక శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం

చేసుకోవాలని చెప్పారు.

మహిళ దినోత్సవం సందర్భంగా  నెల్లూరులో నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

---------------------------

ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.  తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన మునిలక్ష్మి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా 35 లక్షల రూపాయల సబ్సిడీ పొంది కలంకారి కేంద్రాన్ని స్థాపించి ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా సుమారు 50 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. కలంకారి రంగంలో ఆమె చేసిన కృషికి గాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా 'ఉత్తమ కలంకారి' అవార్డు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు ఉపయోగించుకోవాలని తిరుపతికి చెందిన మునిలక్ష్మి తెలిజయజేస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనలో యువత భాగస్వాములు కావాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియంలో వికసిత్ భారత్ – 2047, స్వర్ణాంధ్ర – 2047 ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అవకాశాలు అనే అంశంపై  చర్చా కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల మేధస్సు యూనివర్సిటీకి విలువైన సంపదగా నిలుస్తుందని చెప్పారు.  వికసిత్ భారత్ లక్ష్యాలను సాకారం చేయడంలో ఏఐ కీలకంగా  ఉంటుందని తెలిపారు.

---------------------------

ఐసిసి పురుషుల టి 20 వరల్డ్ కప్ ఫైనల్ దశకు చేరుకుంది. తుది పోరులో భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. సెమీ ఫైనల్ లో భారత్, ఇంగ్లాండ్ జట్టును ఓడించగా, న్యూజిలాండ్ దక్షిణ ఆఫ్రికా జట్టును ఓడించి ఫైనల్ కు చేరాయి. అహ్మదాబాద్ లోని నరేంద్రమోదీ స్టేడియంలో ఈరోజు రాత్రి ఏడు గంటలకు ఫైనల్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు భారత్ రెండు సార్లు టీ 20 వరల్డ్ కప్ గెలవగా, న్యూజిలాండ్ 2021లో ఫైనల్ కు చేరి రన్నర్ ప్ గా నిలిచింది

---------------------------

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బాపట్ల శాసనసభ్యులు  వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సముదాయంలో ఏర్పాటు చేసిన మినుములు, పెసలు, శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు  మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.  కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

---------------------------